నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త సర్వీసుల విడుదల, విద్యుత్ వైర్లకు దగ్గరలో ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శనివారం పలు ఫీడర్ల పరిధిలో నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 3 నుంచి 13 వరకు, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రోడ్డు నెంబర్ 23 నుంచి 30 వరకు విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు సాయిగౌతమ్‌కాలనీ, సాయి చంద్ర కాలనీ, గ్రీన్ స్పేస్ ప్రైం, గ్రీన్ స్పేస్ సిగ్నేచర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు జనచైతన్య ఫీడర్, లక్ష్మీనగర్ ఫీడర్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీజీ కాలేజీ ఫీడర్, మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు పుప్పాలగూడ ఫీడర్, 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 29, 9ఎ, ఫ్లోరా గేటెడ్ కమ్యూనిటీల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 13 నుంచి 22 వరకు, రోడ్డు నెంబర్ 1, సెక్టార్ 2లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లాలమ్మగార్డన్, శ్రీరాంనగర్ కాలనీ, బతుకమ్మ పార్క్ ప్రాంతాలలో సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ వివరించారు.

కౌశిక్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

సీఎంపై అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

రాజేంద్రనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... ఒక ఎమ్మెల్యేగా ఉండి కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రిని దూషించడం సరి కాదన్నారు. బాధ్యతయుతమైన పదవీలో ఉన్న ముఖ్యమంత్రిని తరుచూ దూషిస్తున్న కౌశిక్ రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని అందుకే స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆటో ఢీకొని స్కూటీపై వెళ్తున్న ముగ్గురికి గాయాలు

గాయపడ్డవారిలో ఇద్దరు విద్యార్థులు



గాయపడిన వ్యక్తి, పిల్లలు

మణికొండ: పాఠశాలలో పిల్లలను వదిలేందుకు స్కూటీపై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వారు గాయపడ్డారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఈ సంఘటన శుక్రవారం ఉదయం జరిగిందని స్థానికులు తెలిపారు. స్కూటీని ఆటో ఢీ కొట్టడంతో దానిపై ఉన్న ఇద్దరు పిల్లలు, ఓ వ్యక్తి కింద పడిపోవటంతో వారికి గాయాలయ్యాయన్నారు. ఆటో ఆపకుండానే వెళ్లిపోయాడని, తరువాత సీసీ కెమెరాల ఫుటేజీతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు వివరించారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే ఆటోలు, వాహనాలపై వారు చర్యలు తీసుకోవాలని కోరారు.

సండే 'ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమరీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'రెస్పాండింగ్ వర్సెస్ రియాక్టింగ్: చూజింగ్ పీస్'అనే అంశంపై హైదరాబాద్‌లోని వానిక్స్ టెక్నాలజీస్ సీఈఓ, డాక్టర్ అశ్విన్ రానా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

ఆగస్టు 15న డయాలసిస్ ప్రీమియర్ లీగ్

గోల్కొండ: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్న వారి కోసం ప్రత్యేకంగా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని సాఫ్ మెడికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ సాలార్‌జంగ్ కాలనీలోని సాఫ్ కిడ్నీ సెంటర్ ఆయన డీపీఎల్ క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి అనుమతితో ఆగస్టు 15న ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమీద్ చారిటబుల్ ట్రస్టు వారి సహకారంతో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో డీపీఎల్‌ను ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్ సయ్యద్ కిర్మానీ, డాక్టర్ సోహేబ్ అహ్మద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల పారాహుషార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి
- శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



ఆస్పత్రి ఆవరణలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్: సీజనల్ వ్యాధుల నియంత్రించేందుకు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు వివరాలు, వాటి సరఫరాను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ దుర్గలతకు సూచించారు. వైద్యులు, సిబ్బంది కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఆస్పత్రి పరిసరాల్లో వర్షపు నీరు నిలవకుండా వారానికోసారి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా హాజరు పట్టికను పరిశీలించి, రోగులను వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సేవలకు నీటి కొరత ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నీటి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పరిశుభ్రతతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదన్నారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి



విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసిన విజయ్‌కుమార్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ఐటీ సంస్థలు, సేవా సంస్థలు, దాతలు అండగా ఉండాలని మండల విద్యాధికారి జి.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఓపెన్ టెక్స్ ఐటీ సంస్థ అందించిన స్కూల్ బ్యాగ్‌లు, స్టేషనరీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి అన్ని రకాల సౌకర్యాలను పేద విద్యార్థులకు అందించటం సాధ్యం కాదన్నారు. కొన్ని ఇలాంటి సేవా దృక్పథం ఉన్న సంస్థలు అందిస్తే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ డి.పురుషోత్తం, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి చెత్తను సేకరించే కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్ మల్లికార్జున కాలనీలో తడి, పొడి, హానికరమైన చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు మణికొండ మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావును కోరారు. శుక్రవారం మున్సిపాలిటీకి వచ్చిన ఆయనను కలిసిన నాయకులు పుప్పాలగూడలో అంబేడ్కర్ భవనం, శ్మశానవాటిక రోడ్డు, రెడీమిక్స్ ప్లాంట్లను తొలగించటం, పందెన్‌వాగుపై వెంకటేశ్వర కాలనీ వద్ద ఉన్న వంతెన విస్తరణ పనులను చేపట్టాలని కోరారు. స్పందించిన ఆయన వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. వారానికి ఒక సారి మున్సిపాలిటీకి వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, అధికార ప్రతినిధి ఉపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మిలిటరీ' రోడ్డును తెరిపించండి

కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర ఎంపీలు

మణికొండ: నార్సింగి–మణికొండ మున్సిపాలిటీల పరిధిలో అడ్డుగా ఉన్న మిలట్రీ భూమిని ఇచ్చి రోడ్డు కనెక్టివిటీకి అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రి సంజయ్ సేత్‌ను కోరినట్టు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అలకాపూర్ టౌన్‌షిప్ మీదుగా రెండు మున్సిపాలిటీలకు లింక్‌గా ఉన్న రోడ్డు ఓ వైపు మిలట్రీ స్థలం ఉండటంతో రోడ్డు వేయటం సాధ్యం కాలేదన్నారు. దాంతో ప్రజలు దూరాభారాలకు గురి కావాల్సి వస్తుందని, మున్సిపాలిటీకి రోడ్డు కొరకు ఇచ్చే భూమికి తగ్గట్టుగా ప్రభుత్వ భూమిని మిలట్రీకి ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని వివరించానన్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అయి రోడ్డు వేసుకునేందుకు అవకాశం వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, మెదక్ ఎంపీలు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభకరం



రాజేంద్రనగర్‌లోని మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శాస్త్రిపురం: శ్రావణ మాసం సందడి మొదలైంది. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కావడంతో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటిలాడుతున్నాయి. శ్రావణమాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు లక్ష్మీదేవి నామస్మరణలతో మారుమోగాయి. మొదటి శుక్రవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూజలతో పాటు ఉపవాస దీక్షలు చేస్తుండంతో ఆయా దేవాలయాల వద్ద భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు మంగళగౌరి వ్రతం చేసి తోటి మహిళలకు పసుపు కుంకుమలను అందిస్తున్నారు. దీంతో ఏ ఇంట చూసినా పండగ వాతావరణం నెలకొంది. దేవీ ఆలయాలలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. శ్రావణ మాసం నేపథ్యంలో పూజా సామగ్రి, పండ్లు, పూలు విక్రయాలు ఊపందుకున్నాయి.

అక్రమంగా చేపట్టిన నిర్మాణం సీజ్

రాజేంద్రనగర్: ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ పనులు చేపడుతున్న నిర్మాణాన్ని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి సర్వే నంబర్ 13లోని రెండు ప్లాట్లు కొనుగోలు చేసిన యజమాని కొన్ని రోజులుగా భారీగా సెల్లార్ పనులను చేపడుతున్నారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం ఇవ్వకుండా పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సెల్లార్ పనులను నిలిపివేయాలని చివరిసారిగా హెచ్చరించినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణ స్థలాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి విశాల్ రెడ్డి మాట్లాడుతూ... సెల్లార్ పనులకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. పనులను నిలుపుదల చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు అందించినా స్పందించలేదన్నారు. దీంతో నిర్మాణాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ రెవెన్యూ చట్టం ప్రకారం స్థలాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టేవారు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ నుండి అనుమతులు పొందాలని సూచించారు. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతులను జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించి ఎప్పటికప్పుడు నోటీసులను జారీ చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణాలను కూల్చివేయడంతో పాటు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

అన్నిదానాల కంటే రక్తదానం ఎంతో ఉత్తమం

రాయదుర్గం: అన్నిదానాల కంటే రక్తదానం ఎంతో ఉత్తమమని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్గిల్ విజయ దివాస్‌ను పురస్కరించుకొని రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో ఎఫ్‌డీడీఐ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ వీర జవాన్లను స్మరించుకొంటూ ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు సైనికులు, ఎఫ్‌డీడీఐ విద్యార్థులు, అధికార యంత్రాంగం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అందరితో రక్తదానం చేస్తామని ప్రమాణం చేయించి వీర జవాన్లను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడి, జ్యోతిప్రియ ఎండీ మనోహర్ హుస్సేన్, అమిత్‌పోరి గోస్వామి, అమిత్ తివారి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సైనికులతో తేజ్‌లోహిత్‌రెడ్డి

గొర్రెలు, మేకల పెంపకందారులు జాగ్రత్తలు పాటించాలి



శిక్షణలో పాల్గొన్న పెంపకందారులు, శాస్త్రవేత్తలు

ఏజీవర్సిటీ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే రోగాలు వచ్చి నష్టాలు వచ్చే సూచనలు ఉన్నాయని శాస్త్రీయ పద్ధతిలో పెంచితే తప్పని సరిగా లాభాలు గడించవచ్చని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి పేర్కొన్నారు. శుక్రవారం పీవీ నిర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో పరిధిలోని లైవ్ స్టాక్ ఫామ్ కాంప్లెక్స్‌లో శాస్త్రీయ పద్ధతిలో గొర్రెల, మేకల పెంపకంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా గొర్రెలు, మేకల ప్రాముఖ్యత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్రీడింగ్, న్యూట్రిషన్, ఆరోగ్య పరిరక్షణ, పశుగ్రాసాల పెంపుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. బ్రీడింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నాణ్యమైనవి, మేలైనవి ఎంచుకోవాలని సూచించారు. ఏ పశుగ్రాసం అయితే త్వరగా వస్తుంది ఏ పశుగ్రాసం తింటే బరువు పెరుగుతుంది అనే విషయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రఘునందన్, డాక్టర్ అమరేశ్వరి, పద్మజ, నళినీకుమారి, వెంకటయ్యగౌడ్, శివప్రసాద్, రామకృష్ణ, వెంకటేష్, పెంపకందారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, వందరోజుల ప్రణాళికలో బైరాగిగూడలో పార్కు అభివృద్ధి చేయాలని స్థానిక నాయకులు కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం రోడ్డు గుండా వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయన్నారు. గుంతలు, వాహనాల రద్దీ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్‌కు వివరించారు. వర్షాకాలంలో మరీ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయన్నారు. రాత్రివేళలో గుంతలు తెలవడం లేదన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కమిషనర్‌ను కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలో రోడ్డు మరమ్మతు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. స్థానిక నేతలు హరీష్‌గౌడ్, రాంప్రసాద్, చిట్టిబాబు, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వర్షార్పణం!

శాస్త్రిపురం: రెక్కాడితే కానీ డొక్కాడని రోజు కూలీలకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పనులు దొరకకపోవటంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి చింతల్‌మెట్ అడ్డాపై అడ్డాకూలీలు పని కోసం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చి నిలబడిన పనులు లేక బిక్కుబిక్కుమంటూ పనులు ఇచ్చే వారికోసం ఎదురు చూస్తున్నారు. మామూలు రోజుల్లోనే అంతంత మాత్రం పనులు దొరుకుతుండగా మధ్యాహ్నం వరకు కూలీలు రోడ్డుపైనే పనుల కోసం ఎదురు చూస్తూ చేసేది లేక ఇంటికి వెనుదిరుగుతున్నారు. ఇక రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కూలీలంతా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో వివిధ రకాల భవన నిర్మాణ పనులు కూడా అంతంత మాత్రమే జరుగుతాయి. దీంతో కొంత మందికి పని దొరికినా ఎక్కువ మందికి పనులు దొరకపోవటంతో కూలీల కుటుంబాలు పస్తులతో గడుపుతున్నారు. ఈ రోజున ఎలాగైనా పని దొరుకుతుందని గంపెడాశతో అడ్డామీదికి వస్తే ఆశలన్నీ రెండు రోజులుగా అడియాశలైయ్యాయని అత్తాపూర్‌కు చెందిన సాయమ్మ అనే అడ్డాకూలీ పేర్కొంది. వారం రోజుల పాటు అడ్డామీద పని కోసం వస్తే మూడు రోజుల పాటు పని దొరుకుతుందని కార్మికుడు రాములు తెలిపారు. వర్షం కారణంగా చింతల్‌మెట్ పరిసర ప్రాంతంలో నివాసం ఉండి పలు మార్కెట్లలో పని చేస్తున్న హమాలీ కార్మికుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వారు కూడా వర్షం కారణంగా సరుకు రాకపోవటంతో ఎలాంటి పనులు దొరక్క నిరాశతో పస్తులు ఉండాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేద్దాం



అలకాపూర్ టౌన్‌షిప్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

మణికొండ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

మణికొండ: పెరుగుతున్న జనాభా, నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న మున్సిపాలిటీల్లో సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంపొందించేకు ప్రతి ఒక్కరూ వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మణికొండ మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 16 పార్కులలో పెద్ద ఎత్తున చేపట్టే వనమహోత్సవాన్ని ఆయన అలకాపూర్ టౌన్‌షిప్‌లోని అబ్దుల్ కలాం పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పచ్చదనం ఎంత పెరిగితే ప్రజల ఆరోగ్యాలు అంత బాగుంటాయన్నారు. పార్కులతో పాటు రోడ్ల పక్కన, ప్రభుత్వ స్థలాల్లో వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటించాలన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో పండగలకు మామిడి ఆకులు లభించటం ఇబ్బందిగా మారిందని, భవిష్యత్తులో ప్రజలందరికీ మామిడి ఆకులను అందించే క్రమంలో ప్రతి పార్కులో మూడు మామిడి మొక్కలను నాటించటం మంచి పరిణామన్నారు. డీఈలు శివసాయి, సంజయ్, గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు, అలకాపూర్ టౌన్‌షిప్ వాసులు పాల్గొన్నారు.

అవార్డులు ఉత్సాహాన్నిస్తాయి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



ఉత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాంచందర్‌రావు తదితరులు

మణికొండ: మనం చేస్తున్న పనులను గుర్తించి ఎవరైనా అవార్డులు, పోత్సాహకాలు ఇస్తే అవి మరింత ఉత్సాహాన్ని తెస్తాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రదాన్ కన్వెన్షన్‌లో శుక్రవారం రాత్రి సుమధుర గ్రూప్, మానేపల్లి జెవెల్లర్స్‌ల ఆధ్వర్యంలో ఇచ్చిన వైశ్య లైమ్‌లైట్ గ్రాండ్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రంలో వైశ్యులు అనేక వ్యాపారాల్లో రాణిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి ఇలా అవార్డులు ఇవ్వటం వారికి మరింత ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఇది మంచి సంప్రదాయమని, దీన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ వ్యవస్థాపకుడు ఇమ్మడి శివకుమార్, సుమధుర గ్రూప్ డైరెక్టర్ గుండా నవీన్‌కుమార్‌లతో పాటు స్పాన్సర్‌లు, అవార్డులు అందుకున్న పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

భవనం పై నుంచి పడి యువకుడి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: భవనం పై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉదయ్ రాజ్ కుమారుడు సరోజ్ సాగర్(23) లంగర్‌హౌజ్ ప్రాంతానికి వలస వచ్చాడు. ఓ కాంట్రాక్టర్ వద్ద బిల్డింగ్ ఎలివేషన్ పనులు చేస్తున్నారు. రోజులానే గురువారం ఉదయం కాటేదాన్ దుర్గాహిల్స్ ప్రాంతంలో ఓ భవనంలో రెండవ అంతస్తులో అల్యూమినియం పనులు చేస్తుండగా కాలు జారి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో భవనం యజమాని దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.